'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

'తప్పుడు'తో ముప్పు

ప్రస్తుతం నడుస్తున్నది సామాజిక మాధ్యమాల యుగం. ఇందులో ఫేక్ న్యూస్ లేదా తప్పుడు సమాచారం కుప్పలు తెప్పలుగా వస్తుంటుంది. ఏది సత్యమో, ఏది అసత్యమో తేల్చుకోవడం చాలా కష్టం. నిజం గడప దాటేలోగా అబద్ధం ప్రపంచమంతా చుట్టివస్తుందనే నానుడి తెలిసిందే. అసత్య ప్రచారాలతో, దుష్ప్రచారాలతో సామాజిక మాధ్యమాల్లో వ్యక్తిత్వ హననాలు జరుగుతూనే ఉన్నాయి. నిజం నిలకడ మీద నిగ్గు తేలుతుందేమో కానీ, ఈలోగా మనుషుల మెదళ్లలో చేరే మకిలి ఎప్పుడు పోవాలి? ఎవరు కడగాలి? తప్పుడు సమాచారం సమాజంలో అవిశ్వాసాన్ని పెంపొందిస్తుంది. 2024 సంవత్సరంలో ప్రపంచం ఎదుర్కొనే సమస్యల్లో కాలుష్యం, యుద్ధాలు ఉండితీరతాయనేది అందరికీ తెలిసిందే. అదేవిధంగా ప్రకృతి బీభత్సాలు, ఆర్థిక ఉత్పాతాలు ఎటూ ఉండనే ఉంటాయి. అయితే ప్రధానంగా ముప్పు కలిగించే అంశాల్లో 'తప్పుడు సమాచారం' రెండో స్థానంలో ఉన్నట్టు ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యుఈఎఫ్) హెచ్చరించడం గమనార్హం. బుధవారం విడుదల చేసిన ముప్పుల నివేదికలో అనేక ఆసక్తికరమైన అంశాలున్నాయి. ప్రపంచవ్యాప్తంగా సర్వే చేసి రూపొందించిన ఈ నివేదికలో ఐదు ప్రధానమైన ముప్పులను తేల్చారు. ఈ ఐదింటిలో అన్నిటికన్నా ఎక్కువ ముప్పు 'తప్పుడు సమాచారం' వల్ల కలుగుతుందని నివేదిక అంచనా వేస్తున్నది. వచ్చే రెండేండ్ల పాటు ఈ సమస్య వేధిస్తుందని అంటున్నారు. ప్రత్యేకించి భారత్‌కు ఈ ముప్పు అధికంగా ఉన్నదని హెచ్చరించడం విశేషం. 20 ఏండ్లుగా వెలువడుతున్న ఈ నివేదికల్లో తప్పుడు సమాచారాన్ని పెద్ద ముప్పుగా గుర్తించడం ఇదే ప్రథమం.

బోధన, వాణిజ్యం, ప్రభుత్వ వర్గాలకు చెందిన 1,500 మంది నిపుణుల అభిప్రాయాల ఆధారంగా డబ్ల్యుఈఎఫ్ నివేదిక రూపొందుతుంది. ఎన్నికల్లో దుష్ప్రచారం, ప్రకృతి ఉత్పాతాలు, సమాజంలో చీలికలు, సైబర్ అభద్రత, సాయుధ ఘర్షణలను ఐదు స్వల్పకాలిక, దీర్ఘకాలిక ముప్పులుగా నివేదిక గుర్తించింది. అంటువ్యాధులు, ఆర్థిక నేరాలు, అసమానతలు, కార్మికుల కొరత వంటి ముప్పులను కూడా ప్రస్తావించినప్పటికీ దీర్ఘకాలికంగా కాలుష్యమే అతిపెద్ద సమస్యగా ఉంటుందని తేల్చిచెప్పింది. గరిష్ఠస్థాయిలో 66 శాతం మంది వాతావరణ కాలుష్యం అతిపెద్ద ముప్పు అని అభిప్రాయపడగా, 53 శాతం మంది కృత్రిమ మేధ (ఏఐ) ద్వారా వండివార్చే తప్పుడు సమాచారం పెద్ద సమస్యగా ఉంటుందని తెలిపారు.

ఈ ఏడాది భారత్‌తో సహా 60కి పైగా దేశాల్లో ఎన్నికలు జరుగనున్నాయి. 200 కోట్ల మంది తమ ఓటుహక్కు వినియోగించుకోనున్నారు. ఈ కారణంగానే 2024కు ఎన్నికల నామ సంవత్సరమనే పేరు కూడా వచ్చింది. ఎన్నికల ప్రచార క్రమంలో తప్పుడు సమాచారం వచ్చిచేరితే కొత్తగా ఎన్నికయ్యే ప్రభుత్వాల చట్టబద్ధత ప్రశ్నార్థకమవుతుందని డబ్ల్యుఈఎఫ్ నివేదిక తెలిపింది. ఎన్నికల్లో పోటీ చేసేవారు అవతలి పార్టీపై, ఆ పార్టీ అభ్యర్థిపై సామాజిక మాధ్యమాల్లో తప్పుడు లేదా దురుద్దేశపూరిత పోస్టులు పెట్టించడం మనం చూస్తూనే ఉన్నాం. సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు సమాచారంపై ఆయా సంస్థలు నిఘా వేయడం పెద్ద పనే. మరోవైపు ఏఐ ద్వారా తయారుచేసే ఫేక్ పోస్టుల అసలు రంగు పసిగట్టడం అంతకంతకూ కష్టసాధ్యంగా మారుతున్నదని నివేదిక గుర్తుచేసింది. చేతికందిన సమాచారాన్ని గుడ్డిగా తొందరపడి నమ్మకుండా నిజానిజాలు నిగ్గు తేల్చుకోవడం ఒక్కటే ఈ సమస్యకు విరుగుడు. నిరంతర జాగరూకతే 'ప్రజాస్వామ్యానికి రక్ష' అనే పెద్దల మాట ఈ సందర్భంగా గుర్తుకురాక మానదు.

అనుభవం.. ఒక గుణపాఠం

అనుభవం అన్నది భాషలోని చాలా గొప్ప పదాల్లో ఒకటి. ఎందుకంటే కనిపెంచిన తల్లిదండ్రులు, చదువు నేర్పిన ఉపాధ్యాయులు, ఇరుగు పొరుగు పెద్దవాళ్లు, సమాజంలో ఇతరులు చెప్పినా నేర్చుకోని పాఠం అనుభవం నేర్పిస్తుంది. స్వయంగా అనుభవించిన కష్టాలు, సుఖాలు మనిషికి జీవితం అర్థమయ్యేట్టు చేస్తాయి. అయితే ఈ పాఠాలు నేర్చుకోవటంలో అందరికీ ఒకే రకమైన నేర్పు ఉండదు. ఇంగ్లీషులో ఒక సామెత ఉంది. 'చుట్టుపక్కల వారి జీవితం చూసి నేర్చుకునేవారు తెలివైనవారు, తమ తలకాయ పగిలాక నేర్చుకునే వారు తెలివి తక్కువవారు' అని. అయితే మూడోరకం కూడా ఉన్నట్టు 2023 తెలంగాణ శాసనసభా ఎన్నికలు నిరూపించాయి. నాలుగు దశాబ్దాల కాంగ్రెస్ పాలన చూసి కూడా, అద్భుతంగా సాగుతున్న తెలంగాణ రాష్ట్ర పాలనను బీఆర్ఎస్ చేతిలోంచి తీసి కాంగ్రెస్ పార్టీకి అప్పగించిన ఓటర్లు ఈ మూడో కోవకు చెందుతారు. వీరికి ఏ పేరు పెట్టాలో ఆలోచించవలసిన విషయమే!

కనకదుర్గ దంటు
89772 43484

2014 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను 44 ఏండ్ల పాటు కాంగ్రెస్ పాలించింది. సామాన్యుల కనీస అవసరాలు కూడా పట్టించుకోని ఆ పాలనలో అందరికీ కనీసం మంచినీటి సౌకర్యం కూడా లేదు. ఇక సాగునీరు, ఇతర వనరులన్నీ ఈ దక్కన్ పీఠభూమి మీంచి కిందనున్న ఆంధ్రా ప్రాంతానికి పారాయి. 'తలాపునా పారుతుంది గోదారి, మన చేను, మన చెలక ఎడారి' వంటి వేల పాటల్లో ఈ ప్రాంత ఆవేదన వ్యక్తం చేశారు కవులు, గాయకులు. 1956 నుంచి కేవలం పదేండ్లలో పచ్చటి పైరులు ఎండిపోయి, నిధులన్నీ మళ్లిపోయి, ఉద్యోగాలన్నీ మాయమయ్యే సరికి, 1969లో ఒక మహా ఉద్యమం మొదలై దాదాపు 10 నెలల పాటు సాగింది. ప్రపంచంలో అతి దీర్ఘకాలం సాగిన ప్రజా ఉద్యమంగా అది రికార్డులకెక్కింది. హింసతో దానిని అణచివేసిన పాలకులు మళ్లీ యథేచ్ఛగా అదే పంథాలో దాదాపు 45 ఏండ్లు అధికారం చెలాయించారు. ఉబుకుతున్న లావాలా మళ్లీ ప్రతి దశాబ్దానికి ఉద్యమ తీవ్రత పెరిగింది. అయితే ఇందులో సమిధలైంది మాత్రం నిరాశచెందిన తెలంగాణ యువత. దాదాపు 1,200 మందికిపైగా ఆత్మహత్య చేసుకున్నా.. తెలంగాణ రాజకీయ నాయకులకు చీమ కుట్టినట్టు అనిపించలేదు. వందల ఆత్మహత్యలు జరిగినా కాంగ్రెస్, తెలుగు(ఆంధ్ర)దేశం నాయకులు నిమ్మకు నీరెత్తినట్టు వాళ్ల స్వార్థ, అవినీతి రాజకీయాలు సాగిస్తూ పోయారు.

58 ఏండ్ల పాలనలో తెలంగాణ ప్రాంతం పడ్డ కష్టాలు, వేదన వర్ణనాతీతం. అయితే ఈ గతాన్ని ఇప్పుడెందుకు గుర్తు తెచ్చుకుంటున్నట్టు? ఎందుకంటే, ప్రస్తుత కాంగ్రెస్ పార్టీ పాలన జరుగుతున్న తీరును బట్టి! వారు ఎన్నికలు గెలవటానికి వాడిన నినాదాలు, చేసిన ఆరోపణలు, గెలిచాక ప్రవర్తిస్తున్న తీరు ఒక్కసారి అర్థం చేసుకోవడానికి ప్రయత్నిద్దాం!

తెలంగాణ రాష్ట్ర సమితి ఉద్యమం చేసిన తర్వాత సాధించిన తెలంగాణ రాష్ట్రంలో మొదటి ఎన్నికల్లో సహజంగానే ఉద్యమ నాయకుడి పార్టీ గెలిచింది. 'మా సోనియమ్మ రాష్ట్రం ఇచ్చింది కాబట్టి మేమే గెలుస్తాం' అనుకున్న కాంగ్రెస్ నాయకులు తెలంగాణ, ఆంధ్ర రెండు ప్రాంతాల్లోనూ ఓడిపోయారు. ఎందుకంటే నిజానికి తెలంగాణ ప్రజల మీద ప్రేమతోనో, అంతమంది ఆత్మహత్యలు చేసుకున్నారన్న ఆవేదనతోనో సోనియమ్మ రాష్ట్రాన్ని ఇవ్వలేదు. ఇక తమ పప్పులు డకవన్న అవగాహన కలిగి, మళ్లీ ఇక్కడ గెలుస్తామన్న దురాశతో విధిలేక ప్రత్యేక రాష్ట్రం ఇవ్వవలసి వచ్చింది.

> ఇక రెండోది కాంగ్రెస్ వక్కాణింపులు! ప్రజల ఉద్యమంతో వచ్చింది రాష్ట్రం, కేసీఆర్ ఒక్కడు తెచ్చాడా? అని అంటారు. తెలంగాణ సిద్ధాంత కర్త డాక్టర్ జయశంకర్ ఒక విషయం చెప్పేవారు. 'ఏ ఉద్యమానికైనా మూడు పార్శ్వాలుంటాయి. ఒకటి ప్రజా చైతన్యం. ప్రజలకు వారి బాధలు తెలుస్తాయి కానీ, వాటి కారణాలు, పూర్వాపరాలు తెలియవు. ఆ సమాజంలోని విద్యావంతులు, మేధావులు ఈ విషయాలు వారికి అర్థమయ్యేట్టు చెప్పి, వారిని ఉద్యమానికి ఉద్యుక్తులను చేయాలి.

రెండు ఈ ప్రజలను నడిపే నాయకుడు సమర్థత, త్యాగ బుద్ధి, తెలివి తేటలు ఉండి ఉద్యమంలోని ఆటుపోట్లు ఎదుర్కొనే సహనం ఉండి, కాడి వదలకుండా ఉద్యమాన్ని దాదాపు చివరిదాకా తీసుకెళ్లి, విజయం సాధించేవాడు. ఇది చాలా కష్టతరమైనది. 1969 నుంచీ తెలంగాణలో చాలా మంది వారివారి సంస్థల ద్వారా, పార్టీలు పెట్టి ఉద్యమం మొదలుపెట్టారు. కానీ, విజయవంతం కాలేదు. అందుకే ఆంధ్రా నాయకులు తెలంగాణ గురించి చాలా హేళనగా మాట్లాడేవారు. ఇక ఈ నాయకుడు కేంద్ర ప్రభుత్వం మీద ఒత్తిడి తేగలిగితే మూడో ప్రక్రియ జరుగుతుంది. అది కేంద్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వం ఇతర పార్టీల వారిని ఒప్పించి పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టి రెండు సభలలో దానిని ఆమోదింపజేయడం. దీనికి నాయకుడి సమర్థతే ముఖ్యం. ఇది ఏ మేధావి వలన కాదు, ఒక ప్రజ్ఞావంతుడైన రాజకీయ నాయకుడి వల్లనే జరుగుతుంది. అందుకే ఉద్యమ విజయం ఆ నాయకుడికే చెందుతుంది' అని చెప్పేవారు. మరి కేసీఆర్ కదా మనకు రాష్ట్రం సాధించింది!

ఇక 2014 నుంచి 2023 దాకా కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఈ రాష్ట్రాన్ని ఒక అద్భుతమైనదిగా మార్చడం, కేంద్రం నుంచి దాదాపు 40 శాతం అవార్డులు ఈ పసి రాష్ట్రానికి రావటం తెలిసినదే కదా! సామాన్యుల అవసరాలు గుర్తించి వారికి వసతులు కల్పించటం ఆయన సహృదయతకు తార్కాణమే కదా! కరోనా సమయంలో ఇతర రాష్ట్రాల వలస కూలీలను వారి స్వస్థలాలకు పంపటం దీనికి ఉదాహరణ కాదా? ఈ తొమ్మిదిన్నర దేండ్లలో చాలా భాగం జైళ్ల మూత పడటానికి నేరాలు తగ్గి, అతి సామాన్యులకు కూడా ఉపాధి దొరకడం కాదా? దేశంలోనే స్త్రీల భద్రతలో నంబర్ 1 రాష్ట్రంగా ఎదగటం ముఖ్యమంత్రి ఘనత కాదా? చనిపోయిన వారిని గౌరవంగా సాగనంపటం, పుట్టబోయే బిడ్డల క్షేమం కోసం గర్భిణుల ఆరోగ్యం, ఆహారం గురించి శ్రద్ధ తీసుకోవటం కేసీఆర్‌కు మానవ జీవితం విలువ తెలుసన్న సంగతి బహిర్గతం చేయటం లేదా? ఇక ఏరికోరి, మాటల వలలో పడి, గత అనుభవాన్ని తోసిరాజని గెలిపించుకున్న కాంగ్రెస్ ప్రభుత్వ పాలన ఎలా ఉందో చూద్దాం! అన్నం ఉడికిందా అన్నది ఒక్క మెతుకును చూస్తే తెలుస్తుందంటారు కదా! మరి నాలుగు దశాబ్దాలు ఉడకని అన్నం తిని కూడా తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ నాయకుల మాటలు ఎలా నమ్మారు? నమ్మిన ఫలితాలు చూద్దాం!

ఇంటర్మీడియట్ పరీక్షా పత్రాలు కూడా ఒక్కటే కేంద్రంలో పెట్టి, పరీక్షకులైన లెక్చరర్లను అక్కడికే పిలిచి ఆ పత్రాలు దిద్ది పిస్తారు అధికారులు. పోనీ అభయహస్తం అప్లికేషన్ ఫారాలు ఇంకొక చోటికి పంపాలనుకున్నా రూ.1800 పెట్టి కొన్న ట్రంకు పెట్టెల్లో పెట్టి గవర్నమెంట్ కారులో జాగ్రత్తగా పంపాలి కదా! రాపిడో బైకులో పంపుతారా? కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దల నిర్లక్ష్యం ఈ ప్రజల మీద ఎంత ఉందో ఈ పాటికి తెలిసిందా? పైగా రోడ్డు మీద అవి పడ్డాయని ఉప ముఖ్యమంత్రిని అడిగితే, 'మరి దారం ఊసిపోతే పడవా' అని నవ్వులాటగా సమాధానం చెప్తారు. కాంగ్రెస్‌ను గెలిపించిన తెలంగాణవాసులారా, ఇప్పటికైనా మీ జీవితాలకు, మీ జీవిత వివరాలకు ఈ ప్రభుత్వం ఎంత విలువ ఇస్తుందో తెలుస్తున్నదా? ప్రజాపాలన, ప్రజా వాణి వింటాం అన్న ముఖ్యమంత్రికి ఆరు సార్లు ఢిల్లీ వెళ్లే సమయం ఉంది కానీ, రెండోసారి ప్రజా భవన్‌కు వచ్చే ఉత్సాహం లేదు, గమనించారా?

> కేసీఆర్ ప్రజలను కలువరు, బయటకు రారని విమర్శించే కాంగ్రెస్ నాయకులకు ఒక్క విషయం తెలియాలి. ప్రజలకు ఇస్తామన్న సంక్షేమ పథకాలు అందకపోతే, ప్రభుత్వం తాను చేస్తానన్న పని చేయకపోతే అధికారులనో, మంత్రులనో కలవాలి గానీ పనులన్నీ సమయానికే జరుగుతుంటే ఎందుకు? మీకు ఒక విషయం తెలుసా? ఆఫీసులలో సరిగ్గా టైముకు వచ్చి టైము అయ్యేదాకా కూర్చునేవాళ్లు తక్కువ పని చేస్తారు. ఈ విషయం చాలా సర్వేలలో తేలింది.

ఇక ఇప్పుడు జరుగుతున్న విషయాలు, ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు చూడండి. గత ప్రభుత్వం ప్రతిపాదించిన పథకాలు రద్దు చేయటం (ఫార్మా సిటీ), జిల్లాల సంఖ్య తగ్గించటం వంటి పనులు ఏమి సూచిస్తాయి? ఇక ప్రగతిపథం మూతపడి, ప్రతి పాత పని తిరగదోడి ప్రజలలో గందరగోళం సృష్టిస్తే, ఇక వారు చేయవలసినదేమీ ఉండదని ప్రభుత్వ పన్నాగం. డిజిటల్‌గా కంప్యూటర్ మీద తీసుకోవలసిన అప్లికేషన్లు పది రోజులలో వర్గీకరణ చేయవచ్చు. కానీ పేపర్ మీద తీసుకున్నవి ఒక కోటి 25 లక్షలు. కనీసం రెండు నెలల సమయం పడుతుంది. ఈ లోపల ఎంపీ ఎలక్షన్లు అయిపోతాయి. పథకాలు ఇస్తాం, ఇస్తాం అని చెప్పి శాసనసభా ఎన్నికల్లో వలె సార్వత్రిక ఎన్నికలో గెలవాలని కాంగ్రెస్ పార్టీ ఉపాయం అర్థమైందా? ఒక్కసారి ఈ ఎన్నికలు కూడా అయిపోయాయంటే ఇక ఐదేండ్లు మీతో కాంగ్రెస్ ప్రభుత్వానికి పని ఉండదు. గత 44 ఏండ్లు పాలన చేసినట్టే చేసి, తెలంగాణ నిధులు తమ అధినాయకత్వానికి దోచిపెడతారు. వనరులు అదానీ, అంబానీకి కట్టబెడతారు. ఇంకా రెండు తెలుగు రాష్ట్రాలను మళ్లీ ఒకటే రాష్ట్రం లాగ కలిపే ప్రమాదం కూడా ఉంది.

2014 దాకా తమ జీవితం ఎలా ఉండిందో తెలంగాణ ప్రజలు తమ అనుభవాలు గుర్తుచేసుకోవాలి. యువత తెలియనివారికి చెప్పాలి. తాము ఏ పార్టీ పాలనలో బాగున్నామో ఆలోచించుకొని పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు వేయాలి. లేకపోతే శాసనసభలోనే కాక, పార్లమెంటులో కూడా తెలంగాణ వ్యతిరేక పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ ఈ ప్రాంతానికి మంచి జరగనివ్వవు. ఈ సారైనా మాటల మత్తులో పడకుండా మీ అనుభవానికి విలువనివ్వండి. తెలంగాణ ప్రజలను ప్రేమించి, సేవనందించే పార్టీకి ఓటెయ్యండి.

ఆధ్యాత్మిక ఆచరణవాది

స్వామి వివేకానందుడు ఒక హిందూ తత్వవేత్త మాత్రమే కాదు. సామాన్య జనంతో మమేకమై ఒంటిపూట అరకొర తిండితో, చాలీచాలని వస్త్రాలతో పదేండ్ల పాటు యావత్ భారతదేశంలో పర్యటించారు. దేశంలో నెలకొన్న నైరాశ్యాన్ని, పేదరికాన్ని, విదేశీ పాలనా దౌష్ట్యాన్ని, మూఢ నమ్మకాలను, అస్పృశ్యత పాటించే అమానుష కులవ్యవస్థను అర్థం చేసుకొని భారత యువతను మేల్కొలపడానికి నూతన తాత్విక శంఖారావాన్ని పూరించారు. తన అనుభవాలను చెప్తూ 'ముప్పై రోజుల వరకు నిల్వ ఉన్న ఎండు రొట్టెలను భిక్షగా స్వీకరించేవాడినని, వాటిని తినేటప్పుడు నోట నెత్తురు కారేదని' చెప్పుకొన్నారు.

ఆనందేశి నాగరాజు

నేడు యువజన దినోత్సవం

వివేకానందుడు కలకత్తాలో 1863, జనవరి 12 నాడు జన్మించారు. అమెరికాలోని చికాగోలో జరిగిన విశ్వ మత సమ్మేళనంలో అన్ని మతాల సత్యం ఒక్కటే, కానీ, పండితులు పలురకాలుగా వర్ణిస్తారనే ఉపనిషద్ వాణిని వినిపించి జగత్ విఖ్యాతి చెందారు. అయితే, అతను ఛాందసవాది కాదు. నా మటుకు నేను వేదాలలో హేతువాదంతో సరిపడే భాగాలను మాత్రమే అంగీకరిస్తాను. దేవుని గురించిన జ్ఞానమంతా వేదాల్లోనే కలదనడం కుతర్కం. వేదాల్లో హేతువాదంతో సరిపడే భాగాలు మాత్రమే అసలు వేదాలని, తక్కినవేవీ వేదాలు కావనీ మనువు ఒకచోట చెప్పాడు.

ప్రపంచంలో ఉన్న మత గ్రంథాలన్నింటిలో వేదాలు మాత్రమే 'వేదాధ్యయనం సైతం అప్రధానం' అంటున్నాయని వివేకానంద స్పష్టం చేశారు (శ్రీ వివేకానంద సాహిత్య సర్వస్వం-8వ సంపుటం). ఆధ్యాత్మిక బోధనల కన్నా దేశభక్తే ఉన్నతమైనదని చెప్తూ నాకిప్పుడుండే కోరిక ఒక్కటే! ఈ దేశాన్ని మేల్కొలపాలి. ముక్తి, మొదలైనవన్నీ నాకు నిరర్థకాలుగా కనిపిస్తున్నాయన్నారు. శంకరాచార్యుడు అద్వైత సిద్ధాంతాన్ని పండిత వర్గాల్లో ప్రతిష్ఠిస్తే తాను సాంసారిక జీవితంలో, సమాజంలో వెదజల్లడానికి పుట్టానని చెప్పుకొన్నారు. (శ్రీ వివేకానంద సాహిత్య సర్వస్వం-8వ సంపుటం)

> అమెరికాలో మత మార్పిడులపై మాట్లాడుతూ 'నేను మిమ్మల్ని ఒక కొత్త మతంలోకి మార్చడానికి రాలేదు. నిజమైన క్రైస్తవుడు అసలైన హిందువే. అసలైన హిందువు నిజమైన క్రైస్తవుడే' అని హిందూ మతంలోని ఆధ్యాత్మికతను క్రిస్టియన్ మిషనరీల మధ్య తేడాను వివరించారు. (శ్రీ వివేకానంద జీవితచరిత్ర-శ్రీ చిరంతానంద స్వామి)

హిందూ మతంలో పాతుకుపోయిన కులతత్వాన్ని, అస్పృశ్య ఆచారాలను నిలదీస్తూ 'నేటి భారతీయులు హిందువులు కారు; వేదాంతులు కారు. వారు 'నన్ను ముట్టుకోకు' అనే మతస్థులు. వంటిల్లే వారి దేవాలయం. వంట కుండలే వారి దేవతలు. ఈ స్థితి శీఘ్రంగా తొలగిపోవాలి. ఇక అస్పృశ్యులు అనబడు మాల మాదిగలు, పాకివాళ్లు తదితరుల దగ్గరికి పోయి చెప్పండి' మీరే భారత జాతి ప్రాణం. మీయందే ప్రపంచ పరివర్తనం కలిగించే శక్తి కలదు. లేవండి. బంధ విముక్తులు కండి. (శ్రీవివేకానంద జీవిత చరిత్ర- శ్రీ చిరంతానంద స్వామి)

మత విశ్వాసాల కన్నా ఆత్మ విశ్వాసమే మిన్న అని చాటిచెప్తూ ప్రపంచంలోని చాలా మతాలు మనిషికి వెలుపల ఉండే వ్యక్తిగత దేవుడిని నమ్మనివాణ్ని నాస్తికుడని నిందిస్తాయి. కానీ, తనపై తనకు విశ్వాసం లేనివాడు నాస్తికుడని వేదాంతం చెప్తుందని వివేకానందుడు కొత్త నిర్వచనం ఇచ్చాడు. అంతేకాదు, వేదాంతం 'పాపం' అనే భావనను గుర్తించదు. కేవలం 'పొరపాటును' మాత్రమే గుర్తిస్తుంది. అన్నింటికన్నా మహా పొరపాటు ఏమంటే నీవు బలహీనుడవు, పాపాత్ముడవు, నికృష్టుడవు అనుకోవడం అని వేదాంతం చెప్తుందని ఆచరణాత్మక ఆధ్యాత్మికతను స్పష్టం చేశాడు. ఊహాజనిత కాల్పనిక ఆదర్శాలను వెక్కిరిస్తూ తన స్వార్థాన్ని, స్వసుఖానుభవాన్ని వదిలి ఉన్నతాదర్శాలను పాటించాలని ఎవరైనా చెప్తే, అది ఆచరణ సాధ్యం కాదు. నా స్వార్థంతో సమన్వయం చేయగల ఆదర్శాలంటే నేను ఎగిరి గంతేస్తాను అన్నారు. (అనుష్ఠాన వేదాంతం)

విశ్వం, మనిషి ఏకత్వాన్ని, మానవత్వాన్ని తాత్వికంగా ప్రతిపాదిస్తూ కేవలం ఒకే జీవితం, ఒకే ప్రపంచం, ఒకే అస్తిత్వం ఉంది. ఉన్నదొక్కటే. గుణాత్మకంగా వేరే అయినా అన్నింటి స్వభావం ఒక్కటే అని చాటాడు. మానవత్వమే అన్ని మతాలకు మూలమని వివరిస్తూ దేవుడు తన ప్రతిరూపంగా మనిషిని సృష్టించలేదు. మనిషే దేవుళ్లని సృష్టించాడు. మనమే దేవుళ్ల మూల రూపాలం. మనిషే వాస్తవంగా పూజనీయమైన ఏకైక దేవుడని ఆచరణాత్మక వేదాంతం చెప్తుందని వివేకానందుడు పేర్కొన్నారు. సనాతన హిందూ మతాన్ని ఆధునిక శాస్త్రీయ, హేతువాద దృక్పథంతో, మానవతావాదంతో సమన్వయం చేసి యువతను మేలుకొల్పిన ఏకైక తాత్వికుడు వివేకానందుడు.

1949లో... అయోధ్యలో...!

ఆధ్యాత్మిక నగరం 'అయోధ్య' వేదుకలకు ముస్తాబవుతున్నది. నూతనంగా నిర్మితమైన రామ మందిరంలో రాముడి ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమానికి శరవేగంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. బాల రాముడిని సాదరంగా ఆహ్వానించేందుకు భారతీయులు వెయ్యి కండ్లతో ఎదురుచూస్తున్న ఈ సమయంలో బాల రాముడి ప్రతిష్ఠాపనకు సంబంధించిన ఆసక్తికరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. స్వాతంత్ర్యం సిద్ధించిన తొలి రోజుల్లో అయోధ్య రామ మందిరం ఉనికిని కాపాడుకునేందుకు అనాడు రామభక్తులు జరిపిన పోరాటం.. దాన్ని అడ్డుకునేందుకు నాటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ప్రభుత్వం చేసిన ప్రయత్నాలను 'స్వరాజ్య' మీడియా సీనియర్ ఎడిటర్ స్వాతి గోయల్ శర్మ సోషల్‌మీడియాలో పంచుకున్నారు.

బ్రిటిష్ కాలంలో మొదలై మన దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత కూడా కొనసాగిన అయోధ్య రామ మందిరం వివాదం 2019లో సుప్రీంకోర్టు వెలువరించిన చరిత్రాత్మక తీర్పుతో సమసిపోయింది. వందల ఏండ్ల పాటు కొనసాగిన వివాదాస్పద రామ జన్మభూమి హిందువులకే చెందుతుందని సర్వోన్నత న్యాయస్థానం తీర్పునిచ్చిన విషయం విదితమే. అయితే ఈ తీర్పు హిందువులకు అనుకూలంగా రావడానికి మాత్రం 1949లో జరిగిన ఓ ఘటనే ప్రధాన కారణం. అనాడు రామభక్తులు చూపిన తెగువ వల్లనే నేడు అయోధ్యలో బాలరాముడు కొలువుదీరుతున్నాడు. అప్పటి జిల్లా మేజిస్ట్రేట్, అయోధ్య నగర మేజిస్ట్రేట్ రామభక్తులు చూపిన ధైర్యసాహసాలు వమ్ముకాకుండా చూశారు. ఆ సమయంలో కేంద్రంలో ఉన్న పాలకులు రామభక్తుల తెగువను నీరుగార్చే ప్రయత్నం చేసినప్పటికీ జిల్లా మేజిస్ట్రేట్, అయోధ్య నగర మేజిస్ట్రేట్ అడ్డుకున్నారు.

అయోధ్యలోని వివాదాస్పద రామజన్మభూమి స్థలాన్ని తిరిగి పొందేందుకు వందల ఏండ్లుగా సాధువులు, పూజారులు ప్రయత్నిస్తూనే ఉన్నారు. 1528లో బాబ్రీ మసీదు నిర్మితమైన స్థలం ఒకప్పుడు హిందువులకు పుణ్యక్షేత్రంగా విలసిల్లేది. బ్రిటిష్ కాలంలోనూ అయోధ్య రామ జన్మభూమి కోసం పోరాటం జరిగింది. ఈ క్రమంలోనే 1934లో మత పరమైన అల్లర్లు చోటుచేసుకున్నాయి. రామ జన్మభూమిని తిరిగి పొందే ప్రయత్నాల్లో భాగంగా అప్పటి సాధువులు ఓ ప్రణాళిక రచించారు. బాబ్రీ మసీదు సెంట్రల్ డోమ్ కింద బాలరాముడి విగ్రహాన్ని ప్రతిష్ఠించి, ప్రాణ ప్రతిష్ఠ చేయాలని అనుకున్నారు. అనంతరం బాలరాముడి విగ్రహాన్ని 'అచల్' (కదలనిది)గా ప్రకటించాలని వ్యూహం రచించారు.

బాబ్రీ మసీదు వెలుపల చబుత్రా (ప్లాట్‌ఫామ్)పై ఉన్న చిన్న రామ మందిరానికి మహంత్ అభిరామ్ పూజారిగా ఉండేవారు. అయోధ్యలోని చరిత్రాత్మక హనుమాన్ గడీ ఆలయానికి కూడా ఆయనే ప్రధాన పూజారి. ఆ చబుత్రా వద్దనే రామభక్తులు, సాధువులు పూజలు చేసేవారు. తీర్థప్రసాదాలు సమర్పించేవారు. ఎన్నటికైనా అక్కడ రామమందిరం నిర్మించి తీరాలని మహంత్ అభిరామ్ కలలు కనేవారు. హనుమాన్ గడీ ఆలయానికి సమీపంలో రామ్‌దాస్ అనే సాధువు తదితరులతో కలిసి రామ్‌లల్లాను బాబ్రీ మసీదులో ప్రతిష్ఠించాలని ప్రణాళిక వేశారు. అందుకుగానూ 1949 డిసెంబర్ 22 శుక్ల తృతీయ నాడు పవిత్రమైన తిథిని ఎంచుకున్నారు.

ప్రణాళికలో భాగంగా బాబ్రీ మసీదు వెలుపల, రామ జన్మభూమి వద్ద అఖండ కీర్తనలు, రామచరిత మానస్, భజనలు చేయసాగారు. దీంతో స్థానిక ముస్లింలు ఆందోళనకు గురై ఫైజాబాద్ జిల్లా మేజిస్ట్రేట్ కేకే నాయర్‌ను కలిసి పరిస్థితిని వివరించారు. పరిస్థితిని చక్కదిద్దాలని అయోధ్య నగర మేజిస్ట్రేట్ ఠాకూర్ గురుదత్‌ను ఆయన ఆదేశించారు. వివాదాస్పద స్థలం వద్ద జరుగుతున్న కార్యక్రమాలను వెంటనే ఆపాలని గురుదత్ సాధువులకు చెప్పారు. అయినప్పటికీ వారు కార్యక్రమాలను కొనసాగించారు. అయితే అనుకున్న ప్రణాళికను ఆచరణలో పెట్టేందుకు సుమారు 1008 మందికిపైగా భక్తులు నిత్యం అక్కడ ఉండాలని, ప్రజలను కూడా కీర్తనల్లో పాల్గొనేలా చేయాలని సాధువులు భావించారు.

> 1934లో జరిగిన అల్లర్ల తర్వాత బాబ్రీ ప్రాంగణంలోకి హిందువులు రాకుండా ఆంక్షలు విధించారు. వివాదాస్పద స్థలంలోకి ఎవరూ ప్రవేశించకుండా ఓ గేటును ఏర్పాటు చేసి, అక్కడ రాత్రిపూట ముస్లిం వ్యక్తిని కాపలాగా ఉంచారు. అనుకున్న ప్రణాళికను అమలు చేయాలంటే అతన్ని దాటుకొని వెళ్లాలి. అయితే అది అంత సులువేమీ కాదు. కానీ, తమ ఆరాధ్య దైవం కోసం సాధువులు ప్రాణ త్యాగానికైనా సిద్ధంగా ఉన్నారు.

ఆ రోజు రానే వచ్చింది. అది 1949 డిసెంబర్ 22 అర్ధరాత్రి. రామ్‌దాస్ అనే సాధువు ప్రణాళికను అమలు చేసేందుకు సిద్ధమయ్యాడు. బాలరాముడి విగ్రహం, గంట, పూజా సామగ్రితో అతను బాబ్రీ మసీదు ప్రాంగణానికి చేరుకున్నాడు. సంచిలో ఉన్న గంటతో సెక్యూరిటీ గార్డును గాయపరిచి బాబ్రీ మసీదులోకి ప్రవేశించాడు. సెంటర్ డోమ్ కింద బాలరాముడిని ప్రతిష్ఠించి పూజా కార్యక్రమాలు నిర్వహించాడు. బాలరాముడి విగ్రహాన్ని తొలగించేందుకు వీలు లేకుండా, ఇనుప మేకులతో భద్రపరిచాడు.

తర్వాతి రోజు